

వాలంటీర్ల వేతన బకాయిలు విడుదల చేయాలి

కుక్కునూరు : మాధవరం వార్డు వాలంటీర్ల బకాయి వేతనాలు విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ శ్రీనివాసరావుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న మాధవరం వార్డు వాలంటీర్ల గౌరవ వేతనాలను వారి పేర్లు ఆన్‌లైన్‌లో చూపడం లేదని ఐదు నెలలుగా నిలిపివేయడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకున్నప్పటికీ మే, జూన్ నెలలకు సంబంధించిన గౌరవ వేతనం అందించేందుకు పేర్లు ఆన్‌లైన్ చేసేందుకు సాంకేతిక లోపాన్ని కారణంగా చూపుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న వాలంటీర్లకు కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించి వాలంటీర్ల బకాయి వేతనాలు చెల్లించి, వేతనం రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

తిలకం దిద్దుతూ.. హారతులిస్తూ..!

'పోలవరం పోరుకేక' యాత్రకు జిల్లాలో ఘనస్వాగతం

భారీగా తరలొచ్చిన నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు

సంఘీభావం ప్రకటించిన టిడిపి, జనసేన నాయకులు

తొలిరోజు ఐదు గ్రామాల మీదుగా 12 కిలోమీటర్ల పాదయాత్ర

ప్రత్యేక ఆకర్షణగా యువతీ యువకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాకలో మొదలైన పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం కూనవరం చేరుకుంది. అక్కడ నుంచి పాదయాత్ర బృందం పడవలపై గోదావరి దాటి జిల్లాలోని వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట గ్రామంలోకి ప్రవేశించింది. పాదయాత్ర బృందానికి సిపిఎం రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, సిపిఎం జిల్లా కార్యదర్శి రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, నిర్వాసితులు స్వాగతం పలికారు. మహిళలు ఎదురెళ్లి పూలమాలలు వేసి బొట్టు పెట్టి హారతులిచ్చి నేతలకు స్వాగతం పలికారు. అనంతరం రుద్రమ్మకోట గ్రామంలో బహిరంగ సభ ఆ మండల నాయకులు ధర్మాల రమేష్, మడిది దుర్గారావు ఆధ్వర్యాన సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా గుర్తించి నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది ముంపు గ్రామాలన్నింటినీ సర్వేలో కలపాలని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో దీక్షలు చేస్తే 13 గ్రామాలను కలిపామని చెప్పి రెండు నెలల తర్వాత ముంపులో లేవంటూ నిర్వాసితులను మోసం చేశారన్నారు. ఎ, బి, సి బ్లాక్‌లతో సంబంధం లేకుండా ముంపు గ్రామాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. టిడిపి మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్, జనసేన మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణ మాట్లాడుతూ పోలవరం పోరుకేక యాత్రకు తమ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. నిర్వాసితుల సమస్యలు అనేకం ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని చెప్పారు. సిపిఎం ఎన్నో కష్టాలు ఓర్చి నిర్వాసితుల కోసం ఈ పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. నిర్వాసితులంతా ఒక్కటై ముందుకు సాగాలన్నారు. అనంతరం పాదయాత్ర బృంద నాయకుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం నిలువునా ముంచేసేందుకు పూనుకుందన్నారు. ప్రతి ఇంట్లోనూ, ప్రతి గ్రామంలోనూ సమస్య ఉందన్నారు. అంతా కలిసికట్టుగా పోరాడినప్పుడే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. వచ్చే నెల నాలుగో తేదీలోపు సమస్యల పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే ప్రతి ఊరునూ సమరక్షేత్రంలా మార్చి ఉద్యమించేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. పాదయాత్ర బృందం భోజన విరామం అనంతరం యాత్ర కొనసాగించింది. రుద్రమకోట, మద్దిగట్ల, వసంతవాడ, ఆర్వోపల్లి మీదుగా కుక్కునూరు మండలం దాచారం చేరుకుని రాత్రి బస చేసింది.

గిరిజనులపై యుద్ధం ప్రకటించిన బిజెపి


లోకనాథం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పాదయాత్ర బృందం వసంతవాడ చేరుకున్నాక అక్కడ సభ నిర్వహించారు. అలసిన పాదయాత్ర బృందానికి ప్రజానాట్యమండలి కళాకారులు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ఉత్సాహం నింపారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ బిజెపి వచ్చాక గిరిజనులపై యుద్ధం ప్రకటించిందన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు చట్టప్రకారం పరిహారం ఇవ్వకుండా మోసగిస్తుందన్నారు. వైసిపి, టిడిపి 2013 భూసేకరణ చట్టం అమలు చేయడం లేదన్నారు. భూమికి భూమితోపాటు పునరావాసం, పరిహారం ఏ ఒక్కటీ ఇవ్వలేదన్నారు. 1/70 అటవీ హక్కుల చట్టంపై బిజెపి దాడి చేస్తుందన్నారు. టిడిపి, జనసేన నిర్వాసితుల పక్షాన ఉంటారో, లేదో చెప్పాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులోని ఏడు మండలాల ప్రజలను పాలకులు ముంచడం దారుణమన్నారు. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన వైసిపి కాలక్షేపం చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఏం చెప్పారు.. ఏం చేశారు అని అడగడానికే పోలవరం పోరుకేక అని అన్నారు.

పోరాటానికి సిద్ధంగా ఉండాలి..

వి.శ్రీనివాసరావు

వసంతవాడ సభలో నిర్వాసితురాలు మడకం అక్కమ్మ గ్రామంలోని నిర్వాసితుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తమ గ్రామం ముంపులో ఉండగా 45.72 కాంటూరులో పెట్టారన్నారు. భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు ఏదీ ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఇదే సమస్య ఉందని, పోరాడటానికి అంతా సిద్ధంగా ఉండాలని చెప్పారు. స్థానిక ఎంఎల్ఎ ఉలుకు పలుకు లేని బాలరాజుగా ఉన్నారన్నారు. వరదల్లో దెబ్బ తిన్న బాధితులకు జగన్ రెండు కొవ్వొత్తులిచ్చి సరిపెట్టారని ఎద్దేవా చేశారు.



రుద్రమ్మకోటలో హారతులిచ్చి మహిళల స్వాగతం



గోదావరి దాటి జిల్లాలోకి ప్రవేశించిన పోలవరం పోరుకేక పాదయాత్ర

ప్రత్యేక ఆకర్షణగా యువత

పోలవరం పోరుకేక యాత్రలో యువతీ యువకులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. పాదయాత్ర బృందంలో అత్యధికంగా 18 ఏళ్ల నిండిన యువతీ యువకులే ఉన్నారు. యువత ఉత్సాహంగా అడుగులు వేస్తుంటే నాయకులు మరింత ఉత్సాహంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. దీంతో పాదయాత్ర ఉప్పెనలా ముందుకు సాగుతోంది.

నేడు పాదయాత్ర ఇలా..

పాదయాత్ర రెండో రోజు మంగళవారం దాచారం నుంచి కుక్కునూరు, లంకలపల్లి, దిబ్బగూడెం మీదుగా జీలుగుమిల్లి మండలంలోకి ప్రవేశించి రాచన్నగూడెం మీదుగా కామయ్యపాలెం వరకు 19 కిలోమీటర్ల మేర సాగనుంది. మండల కేంద్రం కుక్కునూరులో బహిరంగ సభ జరగనుంది. ఈ కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి రానున్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న, వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు బుర్రి ప్రసాద్, రామకృష్ణ, నగ్మ, కారం లక్ష్మి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతియేటా ఈ బాధలు పడలేం

బురదరాజు రాములమ్మ, రుద్రమ్మకోట



ప్రతియేటా వచ్చే గోదావరి వరదలకు ఇల్లు మునగడంతో సామాన్లను ఇళ్లలోనే వదిలి కట్టుబట్టలతో వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మాకు వచ్చే పునరావాస పరిహారం, ఇంటి పరిహారం ఇచ్చి మాకు కేటాయించిన ఇళ్లలోకి తరలించాలి. గతేడాది వచ్చిన వరదలకు నా ఇల్లు పూర్తిగా పడిపోయింది. ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వలేదు.

డిపిఆర్‌పై కేంద్రం రాష్ట్రంతో ఆడుకుంటోంది

అమరవరపు అశోక్, టిడిపి నాయకులు



పోలవరం నిధులపై రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన డిపిఆర్‌పై కేంద్రం ఆడుకుంటోంది. దీనికి వైసిపినే ప్రధాన కారణం. నిర్వాసితుల సమస్యలు చాలా అలానే ఉన్నాయి. లక్ష కుటుంబాలకుపైగా ఉన్న నిర్వాసితుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం కూడా చేయలేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి అంటూ విడదీసి వివక్ష ప్రదర్శిస్తున్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. యువతకు సంబంధించి కటాఫ్ తేదీ పెంచలేదు. సిపిఎం పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం.

ప్రభుత్వం నుండి సాయం అందలేదు

అంబటి ముత్యాలు, రుద్రమ్మకోట



గోదావరి వరదలకు ఇల్లు కూలిపోవడంతో ఏ దిక్కూ లేక ఒంటరిగా గుడారం వేసుకొని ఉంటున్నాను. దెబ్బతిన్న ఇంటికి నష్ట పరిహారం కూడా నాకు రాలేదు. ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలి.

నిర్వాసితులంతా చేయిచేయి కలపాలి

గణేష్ ఆదినారాయణ జనసేన నాయకులు



సిపిఎం పాదయాత్రకు అంతా సంఘీభావం తెలపడంతో పాటు నిర్వాసితులంతా ముక్తకంఠంతో చేయి చేయి కలపాలి. ఈ ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ రూ.10 లక్షల హామీ గాని, భూములకు ఇస్తానన్న రూ.5 లక్షల పరిహారం ఏ ఒక్కటీ ఇవ్వలేదు. నాలుగేళ్లలో ఇళ్ల నిర్మాణం గాని, వసతులుగాని కల్పించలేదు. గోదావరి వరద సమయంలో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం ఇవ్వలేదు. నిర్వాసితుల కోసం సిపిఎం చేస్తున్న పాదయాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే.

మూడు నెలలు వయస్సు తగ్గిందన్నారు

పూజారి నాగమణి, రుద్రమ్మకోట



నా కుమారునికి 18 సంవత్సరాలకు మూడు నెలల వయస్సు తగ్గిందని అధికారులు సర్వేలో నమోదు చేయలేదు. ఎంత బతిమాలినా పరిహారం రాదని అధికారులు ఖరాఖండీగా చెప్పారు. ప్రస్తుతం నా కుమారుడి వయస్సు 25. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 18 సంవత్సరాలు నిండిన వారి జాబితాలో నా కుమారుడి పేరు చేర్చి పరిహారం ఇవ్వాలి.



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి నేతలు

జగన్ నవరత్నాలు స్వార్థపూరితం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలన్నీ స్వార్థపూరితమని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికీ చేరువచేసింది టిడిపి ప్రభుత్వమేనని, జగన్ రెడ్డి వచ్చాక అమలు చేసిన పథకాల కన్నా రద్దు చేసిన పథకాలే ఎక్కువ అని, ప్రవేశపెట్టిన పథకాలన్నీ స్వార్థపూరితమని పేర్కొన్నారు. మండలంలోని రమణక్కపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. రైతు భరోసా రూ.13 వేలు ఇస్తామని పేర్కొన్న ఆయన కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి ఇవ్వడం మోసం చేయడమేనన్నారు. కానీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేస్తారని తెలిపారు. అలాగే ఒక కుటుంబంలో ఎంతమది చదువుకుంటే అంతమందికీ తల్లికి వందనం పేరుతో ఆర్థికసాయం అందిస్తారన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిమహిళకూ నెలకు రూ.1500 ఇచ్చేందుకు పథకాలు రూపొందించారన్నారు. అలాగే ఈ మండలంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫారెస్ట్ రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించి రమణక్కపేట రైతుల సమస్యను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దేవినేని డేలరామ్, మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య, గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, ఉప్పే సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి రంగు వాసు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహ కార్యదర్శి గద్దే రఘుబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తల్లిబోయిన సత్యనారాయణ, సర్పంచి మొక్కపాటి మురళీకృష్ణ, మేదరమెట్ల సురేంద్రరావు, పార్టీ నూజివీడు మండల అధ్యక్షులు ముసునూరు రాజా, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు హరికోటి సంగీతరావు, నాయకులు యనమదల సత్యనారాయణ(నాని), కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ బారిన పడొద్దు : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం నూజివీడు ట్రిపుల్ ఐటిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు గంజాయి, సిగరెట్, మద్యం వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ మహమ్మారి బారిన పడితే యువత జీవితం నాశనమవుతుందన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ వాడుతున్నట్లు తేలితే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరిండెంట్ జి.అమర్‌బాబు, ఆర్‌జియుకెటి ఎఒ పి.ప్రదీప్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ టి.గోపాలకృష్ణ, డాక్టర్ కె.సౌమ్య, నూజివీడు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది,

రాబోయే ఎన్నికలు చాలా కీలకం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - నరసాపురం/పాలకొల్లు

రాబోయే ఎన్నికలు జనసేనకు చాలా కీలకమని, ప్రతిఒక్కరూ కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. నరసాపురంలోని రాయ్‌పేటలో సోమవారం ఆయన నియోజకవర్గంలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలోకి మీడియాను అనుమతించలేదు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్‌తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలు పట్టణంలో మోటార్ సైకిళ్లపై హల్‌చల్ చేశారు.



మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

'వైఎస్ఆర్ లా నేస్తం' వినియోగించుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అర్హత గల యువ న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టయిఫండ్‌ను సద్వినియోగం చేసుకుని వృత్తిలో పురోగతిని సాధించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం 2023-24 సంవత్సరానికి మొదటి విడతగా రాష్ట్రంలోని 2,677 మందికి వైఎస్ఆర్ లా నేస్తం స్టయిఫండ్‌ను సిఎం జగన్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి రూ.6 కోట్ల 12 లక్షల 65వేలు ఆర్థికసాయాన్ని బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లబ్ధిదారులైన యువ న్యాయవాదులతో కలిసి వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరం మొదటి విడతగా ఈ ఏడాది ఫిబ్రవరి నుండి జూన్ వరకూ ఐదు నెలలకు నెలకు రూ.ఐదు వేలు చొప్పున జిల్లాలో 88 మందికి రూ.25 వేలు చొప్పున రూ.22 లక్షలు యువ న్యాయవాదుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. లా డిగ్రీ పూర్తి చేసి న్యాయవాది వృత్తిలోకి అడుగుపెట్టిన వారికి మూడు సంవత్సరాలకు వారికి ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ ఆర్థిక సహాయం నెలకు రూ.ఐదు వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు, అలాగే మూడు సంవత్సరాలకు రూ.1,80,000 అందజేస్తారని తెలిపారు.



లా నేస్తం లబ్ధిదారులతో కలెక్టర్

విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి

జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ప్రారంభంలో జెసి లావణ్య వేణి

ప్రజాశకి - ఏలూరు

విద్యుత్ వినియోగంలో భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రజలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో విద్యుత్ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులనుద్దేశించి జెసి మాట్లాడారు. కేంద్ర విద్యుత్ అథారిటీ స్టాండింగ్ కమిటీ సూచనల ప్రకారం ప్రతీసంవత్సరం జూన్ 26 నుండి జూలై రెండో తేదీ వరకూ జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ రాజీపడకుండా విద్యుత్ భద్రతలు పాటించడమే ఈ సంవత్సరం నినాదమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గృహ వినియోగదారులు, రైతుకూలీలు, వ్యవసాయదారులు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు తీసుకోవాల్సిన విద్యుత్ జాగ్రత్తలను వివరించారు. ఐఎస్ఐ గుర్తు ఉన్న నాణ్యమైన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని, ఎర్తింగ్ చేయాలని, ప్లగ్ సాకెట్స్ పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలని, తడి చేతులతో ఏ గృహ విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించొద్దని, తాకవద్దని సూచించారు. తడి బట్టలను ఎలక్ట్రిక్ వైర్లపై, సపోర్ట్ వైర్లకు వేలాడ తీయొద్దని తదితర భద్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులుంటే సంబంధిత విద్యుత్ సిబ్బందికి లేదా గ్రామ సచివాలయంలోని ఎనర్జీ సహాయకులకు లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలందరూ భద్రత ప్రమాణాలను పాటించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాచరణ కమిటీలతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామ సభల కంటే కార్యచరణ కమిటీల వల్లే గ్రామాభివృద్ధికి, ప్రజలకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యత సభ్యులు ఎల్ఎస్.భాస్కర్ పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించిన స్పందనలో మండల పరిషత్ ఎఒ జె.శ్రీనివాస్‌కు వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి పంచాయతీరాజ్ చట్టం 1994లోని సెక్షన్ 40లో ప్రతి గ్రామపంచాయతీలోనూ కార్యచరణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశాలున్నాయన్నారు. సహజ వనరుల కార్యాచరణ కమిటీ, మానవ వనరుల కార్యచరణ కమిటీ, ఉపాధి కల్పన స్వయం సహాయక బృందాల కార్యాచరణ కమిటీ, ఆర్థిక కార్యచరణ ప్రణాళిక కమిటీ, పనులు మౌలిక వసతుల అభివద్ధి కమిటీలు తప్పనిసరిగా వేయాల్సి ఉందన్నారు. అయినప్పటికీ నేటి వరకూ ఐదు కార్యచరణ కమిటీలను నేటి వరకూ వెయ్యలేదన్నారు. ప్రతి కమిటీకి సర్పంచి అధ్యక్షులుగా, కార్యదర్శి కన్వీనర్ గానఉంటారని అన్నారు. ఇవి కార్యచరణకు సంబంధించిన వ్యవస్థలు కనుక పనుల నిర్వహణ చురుగ్గా సాగడానికి ప్రతి అంశం సమగ్రంగా చర్చించడానికి పరిపాలన సామర్థ్యం పెంచేందుకు తోడ్పడతాయన్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల కార్యాచరణ కమిటీలను గ్రామపంచాయతీలు వెయ్యకపోవడం దురదృష్టకరమన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అన్ని గ్రామా పంచాయతీల్లోనూ ఐదు కార్యచరణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, వరద శ్యామ్, బండి రంగారావు పాల్గొన్నారు.

రోటరీ సేవలకు పురస్కారాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక రోటరీ క్లబ్ అందించిన విశేషసేవలకు పలుపురస్కారాలు లభించాయి. క్లబ్ 2022-23 సేవా సంవత్సరంలో చేసిన కృషికి గుర్తింపుగా రోటరీ జిల్లా గవర్నర్ విశ్వనాథం భాస్కరరామ్ నుండి జంగారెడ్డిగూడెం రోటరీ ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకుంది. ఆదివారం రోటరీ విజయనగరం సౌజన్యంతో విజయనగరం ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన రోటరీ జిల్లా 3020 పురస్కారాల ప్రధాన కార్యక్రమం 'అంబరం'లో జిల్లా అవార్డ్స్ ఛైర్మన్ డాక్టర్ ఎం.పద్మకుమారి ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ విశ్వనాథం భాస్కరరామ్ ద్వారా అందుకున్నారు. దాకారపు కృష్ణకు బెస్ట్ ప్రెసిడెంట్, ఉడా రాంగోపాల్(గోపీ)కు బెస్ట్ కార్యదర్శి పురస్కారాలతో పాటు తల్లీబిడ్డ సంక్షేమం, నీరు, పరిశుభ్రత, బాలిక విద్య ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ, రోటరీ పబ్లిక్ ఇమేజ్, విద్య అక్షరాస్యత, ఫౌండేషన్, పోలియో నిధి సేకరణ, అత్యవసర సేవ, రోటరీ నాయకత్వవ్యాప్తి తదితర అంశాలను కలుపుకుని మొత్తం 12 పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా బెస్ట్ ప్రెసిడెంట్ దాకారపు కృష్ణ, బెస్ట్ కార్యదర్శి వూడా రామ్‌గోపాల్(గోపీ)లకు జిల్లా నాయకత్వం శుభాకంక్షలు తెలిపింది.

విద్యాకానుక కిట్లు పూర్తిస్థాయిలో అందించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందజేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి టి.బాబూరావుకు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించిన వెంటనే విద్యాకానుక కిట్లను పూర్తిస్థాయిలో అందిస్తామని ప్రభుత్వం మాటఇచ్చి నేడు తప్పిందన్నారు. పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఇవ్వలేదన్నారు. యూనిఫారమ్ కుట్టుకూలి ఛార్జీలు కూడా సరిపోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.పద్మరాజు, జి.తమ్మిరాజు, జి.గంగిరెడ్డి పాల్గొన్నారు.


కోతకు గురైన రోడ్డు మార్జిన్

కోతకు గురైన రోడ్డు మార్జిన్

పట్టించుకోని అధికారులు

భయాందోళనలో వాహనదారులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్


నూజివీడు మండలంలోని లీలానగర్, అక్కిరెడ్డిగూడెం, దిగవల్లి గ్రామాల్లోని రోడ్లు కోతకు గురై దాదాపు మూడేళ్ల గడుస్తున్నా ఆర్అండ్‌బి అధికారులు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు కనీసం దృష్టి సారించడంలేదని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు రహదారి మార్జిన్ కోతకు గురికాగా అది క్రమేణ పెరుగుతూ రహదారి వరకు వచ్చిందని ప్రజలు వాపోతున్నారు. ఈ సంవత్సరం భారీ వర్షాలు నమోదైతే రహదారి పూర్తిగా కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


మట్టిని ట్రాక్టర్లలో లోడు చేస్తున్న పొక్లెయిన్

మట్టి అక్రమ తరలింపుపై చర్యలేవీ?

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామపంచాయతీ పరిధిలోని కావిటి చెరువులో మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న గహ నిర్మాణాల అభివృద్ధి కోసం గ్రామ నాయకులు అనుమతులు పొంది బ్లాక్ మార్కెట్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగిస్తున్నారని ప్రజలు చెబుతున్నారను. సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ విక్రయదారులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

పారిజాతగిరికి రూ.8.64 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. 96 రోజులకు గాను రూ.8,64,542 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు తెలిపారు. ఏలూరు శనివారపుపేట గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి రినామాధురి పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పి.జగపతిరాజు, దండు ధనరాజు, రెడ్డి రంగప్రసాద్, ములగలంపల్లి సేవా సమితి బృందం సభ్యులు పాల్గొన్నారు .

నేరాలు - ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

జంగారెడ్డిగూడెం: రెండు వేర్వేరు చోరీల్లో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న ల్యాబ్‌లో ఇటీవల జరిగిన దొంగతనంపై నమోదైన కేసు, బుట్టాయగూడెం రోడ్డులో ద్విచక్ర వాహనం దొంగిలించడంపై నమోదైన కేసుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీన పరుచుకున్నామని సిఐ ఎం.రాజేష్ తెలిపారు. ల్యాబ్‌లో ఉన్న కంప్యూటర్, ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన లక్కోజి దుర్గారావును సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పట్టుకున్నామని తెలిపారు. నిందితుడి నుంచి ల్యాబ్‌లో మెడికల్ పరీక్షలు నిర్వహించే మెషిన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. వీటివిలువ సుమారు రూ.4.99 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసును వేగవంతంగా ఛేదించిన ఎస్ఐ సాగర్‌బాబు, ఐడి పార్టీ ఎఎస్ఐ సంపత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎన్.రాజేంద్రప్రసాద్, పిసి సత్యనారయణలను అభినందించారు.

మద్యం మత్తులో భార్యపై భర్త దాడి

నూజివీడు రూరల్: మద్యం మత్తులో భార్యపై భర్త దాడి చేయగా ఆమె గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోరవంచ గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ సాహెబ్ మద్యం మత్తులో తన భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన ఆమెను తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులి షేక్ మహమ్మద్ సాహెబ్‌పై నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

భర్త కన్పించడం లేదని భార్య ఫిర్యాదు

నూజివీడు రూరల్: ఈ నెల 13వ తేదీ నుంచి తన భర్త కనిపించడంలేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 13వ తేదీన పిల్లల పేర్లు సచివాలయంలో నమోదు చేసేందుకు వెళ్లిన తన భర్త ఎస్‌కె.సుభాని కనిపించడంలేదని మండలంలోని బోర్వాంచ గ్రామానికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ సిఐ ఆర్.అంకబాబు ఆదేశానుసారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. వివరాలు తెలిసినవారు 9440796440, 08656232433 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పెళ్లి చేసుకుంటానని మోసం..

భీమడోలు: తాడేపల్లిగూడెంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో తనతో పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా లోబర్చుకుని మోసగించి కేసులో ఓ యువకుణ్ని భీమడోలు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భీమడోలు పరిధిలోని పెదలింగంపాడుకు చెందిన ఒక యువతి తాడేపల్లిగూడెంలోని ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయరాలిగా పనిచేస్తున్నారు. అదే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన పెనుమాల పవన్ ప్రకాష్ ఆ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో ఆ యువతి ఇటీవల తనను పెళ్లి చేసుకోవాలని అతన్ని నిలదీసింది. దీనికి యువకుడు నిరాకరించడంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు యువకుణ్ని అదుపులోకి తీసుకుని భీమడోలు కోర్టులో సోమవారం హాజరు పరిచారు.

గృహ నిర్మాణాలకు ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలోని గృహ నిర్మాణ సంస్థ జగనన్న కాలనీల్లో నూరు శాతం ఇళ్ల నిర్మాణాలకు అధికారులు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. దీనిలో భాగంగా కాలనీలో స్థలం మంజూరైన లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి కనపరచకుంటే సదరు లబ్ధిదారునికి ఇంటి నిర్మాణం పట్ల అవగాహన కల్పించడం, చైతన్య పరచడం చేస్తారు. దీనిలో భాగంగా ఇంటి నిర్మాణానికి గృహ నిర్మాణ సంస్థ కేటాయించే మొత్తానికి అదనంగా సదరు లబ్ధిదారుని కుటుంబ సభ్యుల పేర రూ.35 వేలు బకెట్ రుణాన్ని అందించారు. ఇక ఇంటి నిర్మాణ బాధ్యతలను నిర్మాణ సంస్థ మధ్యవర్తిత్వం వహించి గుత్తేదారులకు అప్పగించి ఇంటి నిర్మాణం సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటారు. ఇక రెండో ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పట్ల ఆసక్తి కనపరిస్తే ఇంటి నిర్మాణం కోసం సదరు లబ్ధిదారునికి యూనిట్ ఒక్కింటికి రూ.20 వేల వంతున అడ్వాన్స్ రుణాన్ని అందిస్తారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను గృహ నిర్మాణ సంస్థ అందిస్తుంది.

భీమడోలు మండలానికి 28 జగనన్న లే అవుట్ కాలనీలు మంజూరయ్యాయి. వీటిలో పూళ్ల మిగిలిన లే అవుట్ మినహా ఇతర ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో 1643 ఇళ్ల నిర్మాణాలు జరగాల్సి ఉండగా 1067 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 49 ఇళ్లకు స్లాబులు వేసే కార్యక్రమం పూర్తయింది. 110 ఇళ్ల నిర్మాణాలు స్లాబు స్థాయికి చేరుకున్నాయి. 415 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయి నుంచి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. 443 ఇళ్లు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. వీటన్నింటి నేపథ్యంలో భీమడోలు మండలం గృహ నిర్మాణాల్లో 77 శాతం ప్రగతి సాధించి జిల్లాస్థాయిలో నాలుగో స్థానంలో ఉంది. గృహ నిర్మాణాల కోసం ప్రత్యేకించిన నూరు రోజుల పథకంలో 838 ఇళ్లకు 499 పూర్తి చేసుకొని 60 శాతం లక్ష్యాన్ని సాధించి జిల్లాస్థాయిలో ఏడో స్థానంలో ఉంది. దీనిలో నిర్మాణం ప్రారంభం గాని 509 ఇళ్లలో 160 ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయి. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న గృహ నిర్మాణ సంస్థ ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని, కొంత మేరకు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు గతంలో ఇచ్చే రూ.ఐదు వేల స్థానంలో ప్రస్తుతం రూ.20 వేలు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీనిలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు ఇప్పటివరకు ప్రారంభించని ముగ్గురు, బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న అరుగురు, బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసుకున్న 263 మంది, లింటల్ స్థాయి నిర్మాణం పూర్తి చేసుకున్న 43 లబ్ధిదారులతో కలిపి 306 మంది సదరు రుణాలను తీసుకున్నారు. ఇక రూఫ్ లెవెల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఇచ్చే ముందస్తు రుణాన్ని రూ.పదివేలకు పరిమితం చేశారు. అడ్వాన్స్ రుణాన్ని లబ్ధిదారుని పేరు మంజూరయ్యే తొలి బిల్లు నుంచి మినహాయించుకునే ఏర్పాట్ల గృహ నిర్మాణ సంస్థ చేపట్టింది. ఇక గృహ నిర్మాణ సంస్థ మధ్యవర్తిత్వంతో గుత్తేదారులు కట్టే ఇళ్ల కోసం లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి కనపర్చటం లేదు. దీనికి కారణంగా నిర్మాణాల కోసం ఇసుక కొరత తీవ్రంగా ఉంది. లబ్ధిదారులు కేటాయించిన గోదావరి ఇసుకను కేటాయించిన ర్యాంపు నుంచి తెచ్చుకునేందుకు టన్ను ఒక్కింటికి రూ.176 లబ్ధిదారులు చెల్లించాలి. ఈ మేరకు తమకు కేటాయించిన 20 టన్నుల ఉచిత ఇసుకను తెచ్చుకొనేందుకు రూ.3600 వరకు చెల్లించాల్సి ఉంది. కాని అంత తక్కువ మొత్తానికి ఇసుక సరఫరా చేసేందుకు లారీల యాజమాన్యాలు ముందుకు రావడం లేదు. తాజాగా గృహ నిర్మాణ సంస్థ ర్యాంపు నుంచి ఇసుకను తెచ్చి చేర్చేలా స్టాక్ పాయింట్ వద్ద నిల్వ ఉంచుతున్నారు. తిరిగి అక్కడి నుంచి ఇసుకను నిర్మాణ స్థలానికి తెచ్చుకునేందుకు టన్ను ఒక్కింటికి లబ్ధిదారులు రూ.352 వంతున 20 టన్నుల ఇసుక కోసం రూ.ఏడు వేల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ కిరాయికి సైతం లారీల యాజమాన్యాలు ముందుకు రాకపోవడంతో గృహ నిర్మాణాలపై ఇసుక కొరత ప్రభావం తీవ్రంగా ఉంది.


భీమడోలులో నిర్మించిన ఇల్లు

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

ఘనంగా ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

మాదక ద్రవ్యాలు సేవించి అనారోగ్యానికి గురవుతున్నారని, విద్యార్థులు, యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలని చింతలపూడి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, మెడికో స్టూడెంట్స్ డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని, ప్రతి కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లితండ్రుల పర్యవేక్షణ అవసరమని చెప్పారు. గంజాయి పండించడం, అక్రమ రవాణా చేయడం నేరమని, అలా చేస్తే కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ ఎంవిఎస్.మల్లేశ్వరరావు, ఎస్ఐ డి.హరికృష్ణ, సిబ్బంది, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయి స్వరూప్, సిబ్బంది, న్యాయవాదులు డేవిడ్‌రాజు, విజయరావు, చైతన్య, రంజిత్‌కుమార్, అప్పయ్య, పారా లీగల్ వాలంటీర్లు ఎండీ అక్బర్ అలీ, నండిపాము యేసురత్నం, సచివాలయ మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యార్థులు విద్యార్థి దశ నుంచే మత్తు పదార్థాలపై అవగాహన పెంచుకొని వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డాన్ బాస్కో నవజీవన్ బాల భవన్ వారి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యసనాలు చాలా ప్రమాదకరమన్నారు. వ్యసనాల బారిన పడిన వారి జీవితాలు ఎంతో దుర్భరంగా ఉంటాయన్నారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు బానిస అయితే భవిష్యత్తు అంధకారమైపోతుందన్నారు. సిగరెట్, గుట్కా సరదాగా అలవాటైతే అది అవసరంగా మారిపోతుందని, తరువాత మరణానికి దారితీస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు ఎంత దూరంగా ఉండగలిగితే అంతటి ఆరోగ్య ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, డాన్ బాస్కో నవజీవన్ బాలభవన విజయవాడ కో-ఆర్డినేటర్ లీలావతి, ప్రధానోపాధ్యాయులు పివిఎస్ఎస్‌జి.ప్రసాద్, పిఎంసి ఛైర్మన్ వట్టిప్రోలు జోష్ణ, సర్పంచి మెండ జాన్సీ, పిఎంసి వైస్ ఛైర్మన్ దీన కుమార్, సురేష్ బాబు, శ్యామ్, ఉపాధ్యాయులు, శ్యామల జోష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టాలని సిఐ రాజేష్ సూచించారు. స్థానిక విద్యావికాస్ పాఠశాల ప్రాంగణంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు, గంజాయి, గుట్కా వంటి చెడ వ్యసనాలకు లోనుకాకుండా చదువులో రాణించాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సాగర్ బాబు, పోలీస్ సిబ్బంది, విద్యావికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలు: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మానసిక స్థిరత్వాన్ని కోల్పోయి, పలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందని సామాజిక ఆరోగ్య కేంద్ర చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆల్బర్ట్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీవెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల ఆవరణలో ఎస్ఇబి కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల ప్రధాన ఆచార్యులు వంగా నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఆల్బర్ట్ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల పలు రకాల కేన్సర్లు సంక్రమిస్తాయన్నారు. సైకో ప్రవర్తన, ఆత్మన్యూనత భావం పెరిగి ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగపు క్యాడెట్ల భాగస్వామంతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధి, కళాశాల ఎన్‌సిసి అధికారి శివ శంకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు నాగరాజు, ధనరాజు ఎస్ఇబి సిబ్బంది సీతారాం పాల్గొన్నారు.

ముసునూరు : మాదకద్రవ్యాల వల్ల మనిషి ఆరోగ్యం క్షీణిస్తుందని చైల్డ్ ఫర్ ఇండియా సూపర్‌వైజర్ సుందర్‌రావు తెలిపారు. మండలంలోని చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆశాలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.




మండవల్లిలో...



జంగారెడ్డిగూడెంలో..



భీమడోలులో..


జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ తలారి

ద్వారకాతిరుమలలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంసిటిసిలు రుద్రసూర్యకళా వెంకట శివాజీ, పెద్దిరెడ్డి రమ్యకుసుమ నాగేశ్వరావు, సర్పంచి కుటం స్వర్ణలత సతీష్, జడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్, వైసిపి టౌన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి వెంకటరావు, నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, చెలికాని రాజబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సర్పంచి శివరామకృష్ణ అన్నారు. మండలంలోని రేచర్లలో ఎంపియుపి పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన అందజేశారు. అనంతరం ఎంపిపి డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులనూ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్‌కాంప్లెక్స్ ఛైర్మన్ పార్వతి, గ్రామ పెద్దలు గుత్తా మాధవ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఇఒ శీలం రత్నసునాదం అన్నారు. సోమవారం ప్రత్తిపాడు పాఠశాలలోని విద్యార్థులకు కీర్తిశేషులు నాగతోట పర్సిపాల్ జ్ఞాపకార్థం కుమారుడు చింతపాడు సిఆర్‌పి సుందిబాబు ఆర్థిక సహాయంతో అందించిన నోట్ పుస్తకాల పంపిణీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు పేద విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచి బేతపూడి ఏసేబు రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెండ బాల కుమారి, టీచర్ సువర్ణ కుమారి పాల్గొన్నారు.


విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

'హౌసింగ్‌లో భారీస్థాయిలో అవినీతి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నియోజకవర్గంలో గృహ నిర్మాణాలకు సంబంధించి పెద్ద ఎత్తున అవినీతి రాజ్యమేలుతుందని జనసేన పార్టీ యువనేత ముత్యాల కామేష్ ఆరోపించారు. ఈ మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి తేజోమణికి సోమవారం స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారుల విచారణలో రూ.రెండు కోట్ల అవినీతి జరిగిందన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

స్పందన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

'స్పందన' ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ లాగిన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదుల వివరాలను తహశీల్దార్ సుందర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగిన పరిష్కరించాలని కోరారు. మండలంలో భూ సంబంధిత సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. రీ షెడ్యూల్‌కి సంబంధించిన పనులను పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణ, విఆర్‌ఒలు రామతులసి, మాధురి, శాంతి, రవి, షరీఫ్ పాల్గొన్నారు.

కౌలు కార్డుతో అనేక లాభాలు

ప్రజాశక్తి - మండవల్లి

కౌలురైతు కార్డు వల్ల రైతులు వ్యవసాయంలో ఎన్నో లాభాలు పొందొచ్చని వ్యవసాయ శాఖ సంచాలకురాలు జి.వెంకటమణి తెలిపారు. మండలంలోని కానుకొల్లు రైతు భరోసా కేంద్రంలో రైతులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌలు రైతు కార్డును తప్పనిసరిగా ప్రతి రైతూ కలిగి ఉండాలన్నారు. కౌలురైతు కార్డు వల్ల రైతులు పంట నమోదు చేయించుకోవచ్చని, క్రాప్ లోన్, సబ్సిడీపై విత్తనాలు, ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టపరిహారం పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం కౌలురైతు కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఒ షేక్ జరీనా, రైతులు పాల్గొన్నారు.

గౌడ సంఘ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గౌడ సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడు రామకృష్ణారావు గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌడ కులస్తుల్లో రాజకీయ చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి గౌడ సంఘాలను పటిష్టపరచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలు గౌడ సామాజిక తరగతికి తగిన ప్రాధాన్యతివ్వాలని ఆయన కోరారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు అశోక్ గౌడ్, సంఘ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.


మాట్లాడుతున్న అధికారులు

'జగనన్న సురక్ష'తో సంతృప్తికర సేవలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రభుత్వ సేవలు పూర్తి సంతృప్తి స్థాయిలో ప్రతి కుటుంబానికి అందిచడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎస్.నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రకాల సేవలు ఉచితంగా అందించడమే జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యమన్నారు. కులం, ఆదాయం, పుట్టిన తేదీ, మరణం, వివాహం, ఇ-పాస్‌బుక్, ఆధార్ కార్డులో మొబైల్ నెంబరు నమోదు, కౌలు రైతు కార్డులు తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయ వాలంటీర్లు కలిసి తహశీల్దార్, ఎంపిడిఒ టీమ్‌లుగా పని చేసి ప్రతి కుటుంబాన్ని కలవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి కోర్స పోసమ్మ, తహశీల్దార్ సుందర్ సింఫ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, విఆర్‌ఒలు, పంచాయతి సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రవ్వవారిగూడెం పంచాయతీ మెరకగూడెం గ్రామంలో సోమవారం పలువురు టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ టిడిపి హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు. వైసిపి అధికారంలోకొచ్చాక అభివృద్ధి కుంటు పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఎస్‌టి సెల్ ఉపాధ్యక్షులు తెల్లం వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాముడు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని బిజెపి నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసకుమారఅప్పారావు కోరారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గృహ సంపర్కు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షిత మంచినీటి పథకానికి మెట్లు లేకపోవడం, వీధి దీపాలు వెలగక ఇబ్బందులు, మరుగుదొడ్ల నిర్మాణం నిలిచిపోవడం, గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉన్నప్పటికీ మంజూరు చేయకపోవడం తదితరాలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఎస్‌టి సెల్ శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి డి.శంకర్ పాల్గొన్నారు.